ఉగ్రవాదులను నామరూపాలు లేకుండా చేయండి



ఇందిరా పార్క్ చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీలో కవాడిగూడ డివిజన్ బీజేపీ నేతలు

కవాడిగూడ: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులకు తెగబడ్డ పాకిస్తాన్ ఉగ్రవాదులను నామరూపాలు లేకుండా చేయాలని కార్పొరేటర్ జి.రచనశ్రీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇందిరాపార్క్ చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతులకు అశ్రు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.రవీందర్, రమేష్‌రామ్, జి.వెంకటేష్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్‌లో నిరసన ర్యాలీ చేపడుతున్న బీజేపీ నాయకులు

ఉగ్రవాదాన్ని తుదముట్టించండి



సుందరయ్యపార్కులో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తున్న వాకర్స్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై అత్యంత క్రూరంగా కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఉగ్రవాదాన్ని తుదముట్టించి ఉగ్రవాదం నామరూపాలు లేకుండా చేయాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సుందరయ్యపార్కులో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రదాడిలో చనిపోయిన వారికి అశ్రునివాళి అర్పించారు. హిందూవులను గుర్తించి చంపడం చూస్తుంటే ఇది మతోన్మాదమేనని అన్నారు. ఇలాంటి ఉన్మాదులకు వత్తాసు పలికే వారు.. ప్రోత్సహించే వారు అత్యంత ప్రమాదకరమని అన్నారు. అలాంటి వారికి ఈ దేశంలో చోటు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. మనోహర్‌రెడ్డి, వి.నాగహభూషణం, కిషన్‌రావు, డా. సునీల్, స్కైలాబ్ బాబు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులకు సానుభూతి తెలిపేవారిని వదలొద్దు



బర్కత్‌పుర చమన్ వద్ద మృతులకు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కాచిగూడ: పహల్గాంలో ఉగ్రమూకల దాడిని ఖండిస్తూ బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యర్వంలో గురువారం రాత్రి బర్కత్‌పురలో బీజేపీ నేతలు, కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రమూకల దాడిలో చనిపోయిన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని బీజేపీ నగర కార్యాలయం నుంచి బర్కత్‌పుర చమన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదంతో వారికి సానుభూతి తెలుపుతున్న నీచులను సైతం తుదముట్టించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ర్యాలీలో కార్పొరేటర్ ఉమారాణి, బీజేపీ నేతలు డాక్టర్ ఎన్.గౌతంరావు, కన్నె రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.



కొవ్వత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఎన్నికలు మే 4న

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఎన్నికలు రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా మే 4వ తేదీన కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో జరుగుతాయని ఎన్నికల అధికారి చేపూరి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఎన్నికల్లో ఒక అధ్యక్షుడితో పాటు 29 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. ఈనెల 27న మున్నూరుకాపు భవన్‌లో నామినేషన్ల స్వీకరణ, 28న పరిశీలన తర్వాత జాబితాను విడుదల చేస్తామన్నారు. 29న నామినేషన్ల ఉపసంహరణ, 30న రాత్రి ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికలు మే 4వ తేదీన ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రం 6గంటల తరువాత ఫలితాలను ప్రకటిస్తామన్నారు. మహాసభ జీవితకాల సభ్యులందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి




కవాడిగూడ: వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నగర నాయకుడు కల్వ గోపి ఆధ్వర్యంలో గురువారం కవాడిగూడ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ నినాదంతో ఆవిర్భవించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ రజతోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, విటల్, కార్తీక్‌యాదవ్, వెంకటేష్, శివ, అభి, సాయి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సత్యసాయి ఆరాధన మహోత్సవం



నల్లకుంట: సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో నల్లకుంట శివం మందిరంలో గురువారం భగవాన్ శ్రీసత్య సాయిబాబా 14వ ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతో మహోత్సవం ప్రారంభమయ్యింది. మధ్యాహ్నం భక్తులకు నారాయణ సేవా (అన్నదానం) నిర్వహించారు. సాయంత్రం వేద పఠనం, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ మంగళంపల్లి బృందం సత్యసాయి పంచరత్న కీర్తనల గానం ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో శ్రీసత్యసాయి సేవా సంస్థలు హైదరాబాద్ అధ్యక్షుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



నల్లకుంట: నల్లకుంట మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రవణ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, దేవిరెడ్డి విజితారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ స్క్రాబ్ దుకాణాలు సీజ్

- జనావాసాల మధ్య ఉన్న దుకాణాల్లో తరచూ అగ్నిప్రమాదాలు
- కోర్టు ఆదేశాలతో దుకాణాలను సీజ్ చేయించిన అధికారులు
- గొడవలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు



భోలక్‌పూర్‌లో దుకాణాలను సీజ్ చేసిన జీహెచ్ఎంసీ అధికారులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ అంజయ్యనగర్ సాయిబాబా దేవాలయం వీధిలో జనావాసాల మధ్య కొనసాగుతున్న ప్లాస్టిక్ స్క్రాబ్ దుకాణాలను కోర్టు ఆదేశాలతో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సీజ్ చేశారు. గురువారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రామానుజరెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తదితరులు దుకాణాలను పోలీస్ బందోబస్తు మధ్య సీజ్‌చేశారు. స్క్రాప్ దుకాణాల్లో తరచూ అగ్నిప్రమాదాలు జరగడంతో స్థానికులు స్థానికులు కోర్టుకు వెళ్లి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుపుతూ కేసు వేశారు. కోర్టు తీవ్రంగా హెచ్చరించడంతో అధికారులు ఉన్నపలంగా భోలక్‌పూర్‌కు వచ్చి దుకాణాలను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా సంబంధిత షాపు యజమానులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ ఉపాధిని దెబ్బతీస్తున్నారని పేర్కొంటూ వ్యాపారులు సైతం కోర్టుకు వెళ్లారని ఇరువర్గాల వాదనలు కోర్టులో తేలనున్నాయని అధికారులు తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి ఆ ప్రాంతంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ గోవర్ధన్, ఎస్ఎఫ్ఏలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలే కారణమని...

సాయిబాబా దేవాలయం వీధిలో జనావాసాల మధ్య ప్లాస్టిక్ స్క్రాబ్ దుకాణాలు, గోదాములు ఉండడం వల్ల ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో షాపు చుట్టూ ఉండే గృహ నివాసాలలో ఆస్తినష్టం జరిగింది. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు చర్యలు తీసుకుంటున్నారే తప్పా ఆ తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమను ప్రమాదాల నుంచి రక్షించాలంటూ కోర్టుకు వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు.



పోలీస్‌సుల సమక్షంలో భోలక్‌పూర్‌లో దుకాణాలను సీజ్ చేసిన అధికారులు

జీఓ.317 హామీని సీఎం నిలబెట్టుకోవాలి

- జీఓ.317 చైర్మన్ టి.విజయ్‌కుమార్
- నేడు చలో సెక్రటేరియట్‌కు పిలుపు

కవాడిగూడ: జీఓ.317తో స్థానికత కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48గంటల్లోనే న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి 2023 అక్టోబర్ 2న గాంధీభవన్ సాక్షిగా పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జీఓ.317 చైర్మన్ టి.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం వారు ఓ పత్రిక ప్రకటనను విడుదల చేశారు. జీఓ.317 బాధితుల సమస్యల పరిష్కారానికి గతేడాది ముగ్గురు మంత్రులతో ఏర్పాటు చేసిన జీఓ.317 సబ్ కమిటీ రిపోర్టు సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారన్నారు. కానీ ఇప్పటి వరకు సమస్య పరిష్కరం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీఓ పరిష్కారంతో ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్నారు. అయినా పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జీఓ.317 బాధితుల పరిష్కారానికై శుక్రవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడ్డ కార్మికుడు నర్సింహ

అంబర్‌పేట: విద్యుదాఘాతంతో ఓ భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన గురువారం అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకలోని ఓ ఇంటి యాజమాని అనుమతులకు మించి ఓ భవనాన్ని నిర్మిస్తున్నాడు. నిర్మాణ పనుల కోసం భవన నిర్మాణ కార్మికుడు నర్సింహ(50) మూడో అంతస్తులో పని చేస్తున్నాడు. భవనానికి సమీపం నుంచి హైటెన్షన్ వైర్లు ఉండటంతో ప్రమాదవశాత్తు అతడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. మూడో అంతస్తు నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుత్ వైర్లకు అతి సమీపంలో నిర్మిస్తున్న భవనం

ఉద్యోగాల కోసం యాచించొద్దు..

ఉపాధి కల్పనదారులుగా ఎదగాలి: ఐపీఈ డైరెక్టర్ ప్రొ. శ్రీనివాసమూర్తి

కాచిగూడ: సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని ఐపీఈ డైరెక్టర్ ప్రొ. శ్రీనివాసమూర్తి అన్నారు. గురువారం రెడ్డి కాలేజ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్ – నావిగేటింగ్ చాలెంజెస్ అండ్ అచీవింగ్ సక్సెస్'అనే అంశంపై మూడు రోజుల ఐసీఎస్ఎస్ఆర్ ప్రాయోజిత జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి పోటీ వాతావరణంలో స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొని ఉపాధి కల్పనదారులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఉద్యోగాల కోసం యాచించొద్దని.. పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ఈ సెమినార్ లక్ష్యమని ఎంబీఏ ప్రోగ్రామ్ డైరెక్టర్ ప్రొ. రేణుకాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అచ్యుత దేవి సదస్సుకు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐపీఈ డైరెక్టర్ ప్రొ. రామకృష్ణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ సదస్సులో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ. శ్రీనివాసమూర్తి, ప్రొ. రేణుకాసాగర్


బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌చారి

ముషీరాబాద్: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను గురువారం ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నేత పి.శ్రీధర్‌చారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాడవాడలా పోస్టర్లు, ఇంటింటికీ డోర్ స్టిక్కర్లు అంటించి ప్రజలను సభకు తరలించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, శిరేష్, కృపాకర్, విజయ, స్వరూప, మేఘమాల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలపై వివక్ష



మాట్లాడుతున్న మంచాల వెంకటస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్థానిక సంస్థల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని బీసీ మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. గురువారం ఇక్కడ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల యునైటెడ్ ఫోరం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలకు మాదిరిగా స్థానిక సంస్థల మాజీ ప్రతినిధులకు కూడా పెన్షన్ ఇవ్వాలని కోరారు. యునైటెడ్ ఫోరం అధ్యక్షుడు మంచాల వెంకట స్వామి మాట్లాడుతూ స్థానిక సంస్థల పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని, స్థానిక సంస్థల మాజీ ప్రతినిధులకు బస్ పాసులు, హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రామిరెడ్డి, ప్రొ.గాలి వినోద్‌కుమార్, యునైటెడ్‌ఫోరం ప్రధాన కార్యదర్శి రాజన్నయాదవ్, కోశాధికారి బి.భూపతి, సింగరయ్య గౌడ్, తులసి, సుభాషిణి, భూపతి, ప్రసాద్, సుందరయ్యగౌడ్, గరిక శ్రీహరి పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటేనే మంచి భవిష్యత్

బెల్లంపల్లి ఎంపీ వంశీకృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు డిగ్రీలతో పాటు నైపుణ్యాలు పెంచుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని బెల్లంపల్లి ఎంపీ జి.వంశీకృష్ణ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో 'వికసిత్ భారత్–2047 ఆర్థిక ప్రగతి, సుపరిపాలన'అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... వికసిత్ భారత్ లాంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

◆ ఓయూ వీసీ ప్రొ. కుమార్ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొ. సీహెచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి దేశ జీడీపీని పెంచి యువతకు ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యాసంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే వినోద్‌కుమార్, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొ. లింబాద్రి, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపల్ డా. మట్టా శేఖర్, డా. అశోక్, ప్రొ. సుధాకర్‌రెడ్డి, మధుకర్, రమణ, డాక్టర్ విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.



వికసిత్ భారత్ జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

జటిలమైన సమస్యలను పరిష్కరించాం



ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న భరత్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్: ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ.. అర్హులందరూ పథకాలను సద్వినియోగం చేసుకునేలా తనవంతు కృషి చేస్తానని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ, కలుషిత నీటి సరఫరా, రోడ్ల సమస్యలకు పరిష్కారం చూపుతున్న కార్పొరేటర్‌ను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా గురువారం బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో స్థానికులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి కార్పొరేటర్‌ను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ముషీరాబాద్‌లో రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పని చేస్తున్నామని అన్నారు. నాలుగేళ్లలో ముషీరాబాద్‌లో అనేక జటిలమైన సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచిముదిరాజ్, నాయకులు అనిల్‌కుమార్, గడ్డం నవీన్, బిజ్జి కనకేష్ కుమార్, లక్ష్మణ్, రమేష్‌రాం పాల్గొన్నారు.

ఉగ్రవాద సంస్థలను సర్జికల్ స్ట్రైక్‌తో ఏరివేయాలి



కవాడిగూడలో న్యాయవాదుల జేఏసీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కవాడిగూడ: ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్ ఉగ్రవాద దేశంగా నిలబడుతోందని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. మతోన్మాద తలకెక్కి తీవ్రవాదులుగా మారి పర్యాటకులపై కాల్పులు జరిపి 28మంది ప్రాణాలు బలిగొన్న పాకిస్తాన్ టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలన్నారు. గురువారం కవాడిగూడలోని న్యాయవాదుల జేఏసీ కార్యాలయంలో కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి న్యాయవాదులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి సమయంలో దేశ ప్రజలు, రాజకీయ పార్టీల ఐకమత్యంగా ఉండాలని కోరారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను సర్జికల్ స్ట్రైక్‌తో ఏరివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉపేంద్ర, రామచంద్రరావు, సత్యనారాయణ రెడ్డి విప్లవరెడ్డి, ప్రదీప్, నరేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ గ్రాడ్యుయేట్స్

కాచిగూడ: నెహ్రూనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ప్రోగ్రెస్‌కార్డులను అందుకున్నారు. చిన్నారులకు ఆటపాటలతో పాటు చదువులో ఉన్నతంగా రాణించే విధంగా అంగన్వాడీ కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నట్లు టీచర్ శివరాణి తెలిపారు. పిల్లలకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు విజిత, పుణ్యతితి, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పట్టాలు అందుకున్న చిన్నారులతో అంగన్వాడీ టీచర్లు

మిషన్ ఇంద్రధనస్సు



చిన్నారులకు టీకాలు వేయిస్తున్న ఆశావర్కర్లు చిత్రంలో కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: చిన్నారులు, గర్భిణులను ఏడు వ్యాధుల నుంచి రక్షించడానికి ఇంద్రధనస్సు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద చిన్నారులు, గర్భిణులకు టీకాలు ఇస్తారు. అందులో భాగంగా గురువారం కాచిగూడ, ఇందిరానగర్ బస్తీలో చిన్నారులకు ఆశావర్కర్లు టీకాలు వేశారు. పిల్లల ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిదండ్రులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర, సబిత, రమాదేవి, మల్లికార్జున్, భీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.